క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ

దెందులూరు: గాలాయగూడెం గ్రామానికి చెందిన దాత మణికంఠ కన్స్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతుల దానగుణం, ఆధ్యాత్మిక సేవా భావం అభినందనీయమని అచ్చమ్మ పేరంటాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ పేర్కొంది. గురువారం అమ్మవారి ఆలయ ఆవరణలో ఆలయ అభివృద్ధికి రూ. 25 లక్షలు విరాళం అందజేసిన గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులను శాలువా, అమ్మవారి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఇప్పటికే గంటా కోటేశ్వరరావు దంపతులు ఆలయ అభివృద్ధికి దాదాపు రూ. 60 లక్షలు విరాళం అందజేశారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కొవ్వలిలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు

దెందులూరు: ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరమని దెందులూరు మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు అన్నారు. గురువారం కొవ్వలిలో మోకాళ్ల వ్యాధికి సంబంధించి వల్లభనేని మాణిక్యాంబకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, పార్టీ కొవ్వలి గ్రామ అధ్యక్షుడు కాటి సుధాకర్, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము బాధితురాలి ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు.

జగనన్న హౌసింగ్ కాలనీలను పరిశీలించిన తహసీల్దార్



జగనన్న హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు

పెదపాడు: జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల స్థలం పొందిన లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరులో జగనన్న హౌసింగ్ కాలనీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం గృహనిర్మాణ శాఖ ద్వారా లబ్ధిదారులకు సబ్సిడీపై నిర్మాణ సామాగ్రిని అందిస్తోందని చెప్పారు. నిర్మాణం ప్రారంభించిన వారందరికీ బిల్లులు సకాలంలో చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల అందజేత



సైకిళ్లను పంపిణీ చేస్తున్న వంకిన ప్రతాప్

ఉంగుటూరు: కాగుపాడు హైస్కూల్లో ఇద్దరు విద్యార్థులకు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ వంకిన ప్రతాప్ గురువారం సైకిళ్లను అందజేశారు. విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బందిపడుతున్నారని సాయం చేశారు. కార్యక్రమంలో శీతాల సత్యనారాయణ, హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు గోపిశెట్టి కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాద సమయంలో అప్రమత్తతపై అవగాహన



గ్యాస్‌లీకైన సమయంలో ఏ విధంగా నిలుపుదుల చేయాలో వివరిస్తున్న దృశ్యం



మాక్ డ్రిల్ నిర్వహణా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏలూరు ఆర్‌డీఓ పి కిషోర్

- అద్భుతంగా మాక్ ఎక్సర్‌సైజ్ డ్రిల్
- గ్యాస్ పైపులైన్ లీకేజ్, అగ్నిప్రమాదాలపై అవగాహన

పెదవేగి: గ్యాస్‌పైప్ లైన్ ద్వారా గ్యాస్ లీకైన సందర్భాల్లో ప్రజల ప్రాణనష్టాలను నివారించడంతో పాటు, సురక్షితంగా గ్యాస్ లీకేజిని ఏ విధంగా అరికట్టవచ్చో మాక్ డ్రిల్ ద్వారా అద్భుతంగా అవగాహన కలిగించారని ఏలూరు ఆర్‌డీఓ పెంచల కిషోర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జాతీయ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో మాక్ ఎక్సర్ సైజ్‌ను డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు ఆధ్వర్యంలో ఆర్‌డీఓ పెంచల కిషోర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఆర్‌డీఓ పెంచల కిషోర్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న సహజ వాయువు (మిథేన్) గ్యాస్ పైపులైన్ లీకేజ్‌లు, అగ్నిప్రమాదాలపై అవగాహన, అత్యవసర చర్యలు చేపట్టే అంశంపై మాక్ ఎక్సర్ సైజ్ అద్భుతంగా నిర్వహించారని ఆర్‌డీఓ సిబ్బందిని అభినందించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా గ్యాస్ లీకైనా, గ్యాస్ వల్ల ప్రమాదం సంభవించినా దానిని అరికట్టే విధానం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ప్రమాదంలో గాయపడిన వారిని అత్యవసరంగా తరలించి ఆసుపత్రుల్లో చికిత్స అందించడం, అత్యసర చికిత్సను అందించడం వంటి పలు కృత్యాలను చేసి చూపించారు. జిల్లా అగ్నిమాపకాధికారి మాల్యాద్రి ప్రజలు స్పందించాల్సిన తీరు గురించి వివరించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కేవీ రావు, పెదవేగి మండల వ్యవసాయాధికారి ముత్యాల ప్రియాంక, పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్, ఎంపీడీఓ రాజ్‌మనోజ్, కొప్పాక సర్పంచ్ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు



విద్యార్థులకు ఐరన్‌మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: రక్తహీనతతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, తలనొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులు, తీవ్ర అలసట వంటి సమస్యల వల్ల విద్యార్థులు చదువులో వెనుకబడతారని కాశిపాడు హైస్కూలు హెచ్‌ఎం బి.కాంతిశ్రీ అన్నారు. గురువారం రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యసహాయకుడు నామాల రాజు మాట్లాడుతూ ఐరన్ లోపం వల్ల రక్తహీనత ఏర్పడి ఆరోగ్య సమస్యలు వస్తాయని, క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రంగనాయకులు, మంజుల పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



గాలాయగూడెం గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ ఎస్‌వీ నాంచారయ్య

దెందులూరు: జగనన్న ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని పూర్తి చేయాలని దెందులూరు తహసీల్దార్ ఎస్ వీ నాంచారయ్య అన్నారు. గురువారం గాలాయగూడెం గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అధ్యక్షతన గాలాయగూడెం జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 75 ఇళ్లు నిర్మాణం పూర్తైయ్యాయని, ఇంకా 112 జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. వార్డు మెంబర్ కే.శ్రీధర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు ప్రతి రోజూ జగనన్న లబ్ధిదారులతో కలిసి త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నామన్నారు. గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతంగా నిర్మించేందుకు రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధిలైట్లతో పాటు మెటీరియల్ స్థానికంగా ఆలస్యం లేకుండా సరఫరా చేసేందుకు గోడౌన్ల సైతం జగనన్న కాలనీల సమీపంలోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వీఆర్‌ఓ విష్ణు, సచివాలయ ఉద్యోగులు, వార్డు మెంబర్లు ఉన్నారు.

శరవేగంగా రూ. 9.50 లక్షలతో చెక్‌డ్యాం పనులు



దెందులూరు సైఫన్ వద్ద వేగంగా జరుగుతున్న చెక్‌డ్యాం పనులు

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో మంజూరైన రూ. 9.50 లక్షలతో చెక్‌డ్యామ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. గురువారం చెక్‌డ్యాం పనులను పరిశీలించిన అనంతరం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, దెందులూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు పోకల రాంబాబు, కనకదుర్గమ్మ అమ్మవారి ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం కాల్వ నుంచి వచ్చే నీటిని చెక్‌డ్యాం ద్వారా దెందులూరు మండలం సీతంపేట కాల్వకు నీటిని నేరుగా సరఫరా చేయడం ఈ చెక్‌డ్యాం నిర్మాణం ప్రధాన లక్ష్యమన్నారు. దెందులూరు, అలుగులగూడెం, సత్యనారాయణపురం, దోసపాడు, కొమరేపల్లి, సీతంపేట గ్రామాల్లోని 4832 ఎకరాలకు పోలవరం కాల్వ నీటిని అందించడం జరుగుతుందన్నారు. 6 గ్రామాల్లోని 4700 ఎకరాల సాగుకు రూ. 9.50 లక్షలు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, కొలుసు గణపతిరావు, పోకలరాంబాబు, తొత్తడి వేదకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నసమారాధన



భక్తులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: చల్లచింతలపూడిలోని మేదాదక్షిణామూర్తి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన జరిగింది. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని తొలుత స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వేలాది మంది భక్తులకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, చల్లచింతలపూడి గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ వడ్డన చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పెరుగ్గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, రామారావుగూడెం గ్రామ సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), దెందులూరు, కొవ్వలి గ్రామ పార్టీ అధ్యక్షులు పోకల రాంబాబు, కాటి సుధాకర్, గాలాయగూడెం గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు 12 గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



యర్రమిల్లిపాడులో డ్రైయిన్‌ను పరిశీలిస్తున్న లక్ష్మణరావు

ఉంగుటూరు: ప్రజా భాగస్వామ్యంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏవీ లక్ష్మణరావు అన్నారు. గురువారం యర్రమిల్లిపాడు, నల్లమాడు గ్రామాల్లో ఫీవర్ సర్వే జరిపారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీరు లేకుండా చేస్తే దోమలు ఉండవని స్పష్టం చేశారు. డబ్బాలు, కొబ్బరి బొండాలు టైర్లల్లో నిల్వనీరు లేకుండా చూసుకోవాలని లక్ష్మణరావు సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యకర్తలు పరమేశ్వరి, సంధ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు నాగలక్ష్మి, వెంకటస్వామి సోని తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు



పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలందిస్తున్న అధికారులు

భీమడోలు : కాండం తొలుచు పురుగు, ఆకు ముడత తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు రైతులు పాటించేలా వ్యవసాయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. భీమడోలులోని గురువారం మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ ఎస్‌పీవీ ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేలైన యాజమాన్య పద్ధతుల్లో భాగంగా పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పర్యావరణ విశ్లేషణలో భాగంగా ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి, వ్యవసాయ క్షేత్ర సహాయకులతో కలిసి ఆయన 250 ఎకరాల విస్తీర్ణంలోని వరి చేలను ఆయన పరిశీలించారు. కాండం తొలుచు పురుగు, ఆకు ముడత తెగుళ్లు ఆవరించినట్లుగా గుర్తించారు. రైతులు ఏకరాకు 8 కేజీల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గాని ఒక లీటర్ నీటిలో 0.4 ఎంఎల్ క్లోరాంట్రనిలిపోల్ మందును కలిపి పిచికారీ చేయాలని కోరారు. అదే విధంగా వాతావరణ మార్పుల వల్ల దోమ ప్రబలే అవకాశాలు, పాడ తెగులు వరి పొలం గట్ల వారున వ్యాపించే అవకాశాలున్నాయని, రైతులను గట్లను పరిశుభ్రం చేసుకోవాలని, గట్లపై ఉన్న కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని ఆయన సూచించారు.

తూతూ మంత్రంగా ఎన్నికల కోడ్ అమలు

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ జిల్లాలో ఉన్నప్పటికీ దెందులూరు మండలంలో తూతూ మంత్రంగా అమలు జరుగుతుంది. అధికారులు, గ్రామ స్థాయి ఉద్యోగులు ఎన్నికల కోడ్ అమలును ఏ మాత్రం పట్టించుకోవడం లేదనడానికి గాలాయగూడెం, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో రోడ్డు పక్కనే ఉన్న వివిధ రాజకీయ పార్టీల జెండాలు నిదర్శనం. గాలాయగూడెం గ్రామంలో సచివాలయం పక్కనే మూడు తెలుగుదేశం పార్టీ జెండాలున్నాయి. అక్కిరెడ్డిగూడెం స్కూల్ ఎదుట బీజేపీ జెండా ఉంది. గ్రామస్థాయి, మండల అధికారులు పట్టించుకోకపోవడంతో టీడీపీ, బీజేపీ జెండాలు తొలగించడం లేదని, గ్రామగ్రామాన దెందులూరు మండల వ్యాప్తంగా ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు సైతం ఆదేశాలు జారీ చేయడం, సమీక్షలు, సమావేశాలు నిర్వహించడమే తప్ప, ఎన్నికల కోడ్ అమలును ఎక్కడ పర్యవేక్షిస్తున్నారని, ఎన్నికల కోడ్ ఇలాగేనా అమలు పరిచేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

పెదపాడు: మండలంలోని ఏపూరులో అభయాంజనేయస్వామి 8వ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏపూరులోని ప్లేటైవర సమీపంలో ఉన్న శ్రీ సీతారామ దాసాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న 45అడుగుల అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యన్నారాయణ, చోడే వెంకయ్య కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భజనులు హనుమాన్ చాలీసా పారాయణ చేసారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణపవరం: మండలంలోని వరదరాజపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గణపవరం, సరిపల్లె, వరదరాజపురం, కొత్తపల్లి, కొమ్మర, వెలగపల్లి, అర్ధవరం, ముగ్గుళ్ల, వల్లూరు, వాకపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రణాళిక, కృషితోనే పోటీ పరీక్షల్లో విజయం



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ప్రణాళిక, పట్టుదల, కృషితోనే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి దూలం కిషోర్ అన్నారు. గురువారం ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఎన్‌వైకే ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. యువత సమస్యలను అధిగమించాలని సూచించారు. కళాశాల సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ చేసుకోవాలన్నారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.మధుసూదనరావు మాట్లాడుతూ యువత విద్యతో పాటు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరరాజ్, కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, విష్ణు మోహన్, పీజీ కోర్సు డైరక్టర్ కొండయ్య, అభినయ నృత్యభారతి నిర్వాహకుడు హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న సురేష్ కుమార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీహరికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పవర్‌పేట అంగన్‌వాడీ సెంటర్, నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల విద్యార్థులను పలు ప్రశ్నలు వేయగా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. పాఠశాలలో తరగతి గదుల తాళాలు తీయించగా అవి అపరిశుభ్రంగా కనిపించాయి. దీంతో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. పాఠశాలలోని వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్ఈఓ ఎస్‌వీ రవిసాగర్, ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి తదితరులున్నారు.

ఈ నెలాఖరుకు పన్నులు చెల్లించాలి

భీమడోలు: మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, కుళాయి పన్నులను ఈనెలాఖరు నాటికి చెల్లించాలని భీమడోలు ఎంపీడీఓ జీఎల్‌ఎన్‌వీ రాఘవన్ గురువారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈనెలాఖరు నాటికి కుళాయి పన్నులు చెల్లించకుంటే వాటికి డమ్మీలు వేయాలని, ఇంటి పన్నులు చెల్లించని పక్షంలో వారికి కోర్టు నుంచి నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు. ఎవరైనా ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించేందుకు సిద్ధంగా ఉంటే గ్రామకార్యదర్శి, సచివాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సదరు బిల్ కలెక్టర్‌ను ఇంటి యాజమానుల వద్దకు పంపి వెళ్లి పన్నులు వసూలు చేస్తారని ఆయన తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ సూచన



తాళ్లగోకవరంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలకు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ అన్నారు. పెదవేగి ఎంపీడీఓ జి రాజ్ మనోజ్ గురువారం తాళ్లగోకవరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు అందుతున్న సేవలపై ఆర్‌బీకే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో సచివాలయానికి వెళ్లి సచివాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది హాజరు శాతంను పరిశీలించారు. సిబ్బంది ప్రతి రోజు నిర్ణీత సమయానికి సచివాలయానికి చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అక్కడ నుంచి గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళ్లారు..పాఠశాలలో కొంత కాలంగా ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ పాడైపోయి ఉండటాన్ని గమనించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు ఎక్కడనుంచి సరఫరా చేస్తున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తరగతి గదులు బాగాలేవని, బాలికలకు నిర్మించిన మరగుదొడ్లు కూడా పాడైపోయాయని గుర్తించారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్, మరగుదొడ్లు, తరగతి గదుల లోపల డామేజ్ అయిన ఫ్లోర్ ను ఏడు రోజులల్లో తయారు చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని ఎంపీడీఓ పరిశీలించారు.